నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 | హైదరాబాద్, శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | VIKARABAD



మాక్ పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

## మాక్ పోలింగ్ పరిశీలన

వికారాబాద్, ఫిబ్రవరి 15 : వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) యంత్రాల మొదటి దశ పరిశీలన(ఎఫ్ఎల్సీ) పూర్తి కావడంతో గురువారం వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి మాక్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల మొదటి దశ పరిశీలన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈసీఐఎల్‌కు చెందిన సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి మొదలైన ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నమన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి దశ పరిశీలన పూర్తైందన్నారు. మాక్ పోల్ ఓటింగ్‌లో వివిధ పార్టీల ప్రతినిధులు , ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంగ్లంపై పట్టు.. ఉన్నతికి మెట్టు

- ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలి
- వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్



వికారాబాద్, ఫిబ్రవరి 15 : ఆంగ్లంపై పట్టు.. ఉన్నతికి మెట్టు అనివికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. ఇంటర్ విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో పట్టు సాధించేందుకు ఈ ఏడాది నుంచి ఇంటర్ బోర్డు తీసుకున్న చర్యల్లో భాగంగా ఈనెల 16 నుంచి జరుగనున్న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలని గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ నెల 16న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్ మొదటి ఏడాది ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష 20 మార్కులకు జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈ నెల 17న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్ అనే పరీక్షను ఇంతకుముందు రాయని విద్యార్థులకు మాత్రమే ఉంటుందన్నారు. ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న రెగ్యులర్ విద్యార్థులకు ఎథిక్స్ పరీక్ష ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, పర్యావరణ విద్య పరీక్ష ఈ నెల 19న ఉదయం 10 నుంచి 1 వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు హాజరు కాని విద్యార్థులను ఫెయిల్ అయినట్లుగా ప్రకటించడం జరుగుతుందన్నారు. హాల్ టికెట్లను చదువుతున్న కళాశాలల నుంచే తీసుకోవాలని సూచించారు.

# పల్లె దారులకు.. మహార్దశ



**వికారాబాద్ జిల్లాలో 766 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.59.03 కోట్లు మంజూరు**

- మార్చిలోగా పనుల పూర్తికి అధికారుల చర్యలు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 15 : గ్రామాల్లో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులను జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను వికారాబాద్ జిల్లాలోని 19 మండలాల్లో 766 సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.59.03 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనులను మార్చిలోగా పూర్తి చేయాలని డీఆర్‌డీఏ, ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించడంతో గ్రామాల్లో పనుల ప్రారంభానికి వారు సన్నాహాలు చేస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 206 సీసీ రోడ్లకు రూ.15.98 కోట్లు, పరిగి సెగ్మెంట్‌లో 209 సీసీరోడ్లకు రూ.10.05కోట్లు, తాండూరు సెగ్మెంట్‌లో 223 సీసీ రోడ్లకు రూ.13కోట్లు, కొడంగల్ నియోజకవర్గంలో 128 సీసీరోడ్ల నిర్మాణానికి రూ.20కోట్లు మం జూరయ్యాయి. ఈ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేశారు.
గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి నిధులు(ఏసీడీఎఫ్), ఉపాధిహామీ పథకం నిధులను మంజూరు చేస్తున్నారు. ఇవేకాకుండా మండల పరిషత్, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ నిధులతోనూ సీసీ రోడ్లను పెద్ద ఎత్తున చేపడుతుండడంతో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయి. ప్రభుత్వం వికారాబాద్ జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణానికి పెద్ద మొత్తం లో నిధులు మం జూరు చేస్తుండడంతో ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### మండలాల వారీగా మంజూరైన నిధులు ఇలా..

వికారాబాద్ మండలానికి 33 సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.3 కోట్లు, ధారూరులో 48 సీసీ రోడ్లకు రూ.2.5 కోట్లు, మోమిన్‌పేటలో 41సీసీ రోడ్లకు రూ.3 కోట్లు, మర్పల్లిలో 30 సీసీ రోడ్లకు రూ.2.63 కోట్లు, బంట్వారంలో 30 సీసీ రోడ్లకు రూ.2.85 కోట్లు, కోట్‌పల్లిలో 24 సీసీ రోడ్లకు రూ.2 కోట్లు, పరిగిలో సీసీ 46 రోడ్లకు రూ.2.20 కోట్లు, పూడూరులో 51 సీసీ రోడ్లకు రూ.2.50 కోట్లు, దోమలో 52 సీసీ రోడ్లకు రూ.2.53 కోట్లు, కులకచర్లలో 44 సీసీరోడ్లకు రూ.2.09 కోట్లు, చౌడాపూర్‌లో 16 సీసీ రోడ్లకు రూ.73 లక్షలు, తాండూరులో 52 సీసీ రోడ్లకు రూ.3 కోట్లు, పెద్దేముల్‌లో 53 సీసీరోడ్లకు రూ.కోటి, యాలాలలో 57 సీసీ రోడ్లకు రూ.3 కోట్లు, బషీరాబాద్‌లో 46 సీసీ రోడ్లకు రూ.3 కోట్లు, బొంరాస్‌పేటలో 55 సీసీ రోడ్లకు రూ.7.20 కోట్లు, దౌల్తాబాద్‌లో 36 సీసీరోడ్లకు రూ.6.05 కోట్లు, కొడంగల్ మండలంలో 37 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.6.75 కోట్లు మంజూరయ్యాయి.

### గ్రామాల వారీగా మంజూరైన నిధులు..

మండలంలో గ్రామాల వారీగా సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులు ఇలా ఉన్నాయి. బాపల్లితండాకు రూ.10లక్షలు, బాపన్‌చెరువుతండాకు రూ.10లక్షలు, బొంరాస్‌పేటకు రూ.20లక్షలు, బొట్లవానితండాకు రూ.10 లక్షలు, బురాన్‌పూర్‌కు రూ.15లక్షలు, బుర్రితండాకు రూ.10లక్షలు, చౌదర్‌పల్లికి రూ.15లక్షలు, దుప్‌చెర్లకు రూ.10 లక్షలు, ఎన్నెమీదితండాకు రూ.10లక్షలు, ఏర్పుమళ్లకు రూ.15 లక్షలు, గట్టెగానితండాకు రూ.10లక్షలు, జానకంపల్లికి రూ.10 లక్షలు, కాకర్లగండితండాకు రూ.10లక్షలు, కొత్తూరుకు రూ.15 లక్షలు, కూబ్యానాయక్‌తండాకు రూ.10లక్షలు, లింగన్‌పల్లికి రూ.15 లక్షలు, లోతుకుంటతండాకు రూ.10లక్షలు, మూడుమామిళ్లతండాకు రూ.10 లక్షలు, మదన్‌పల్లికి రూ.15లక్షలు, మదన్‌పల్లితండాకు రూ.10 లక్షలు, మహంతిపూర్‌కు రూ.15లక్షలు, మేడిచెట్టుతండాకు రూ.10 లక్షలు, మెట్లకుంటకు రూ.15లక్షలు, నాగిరెడ్డిపల్లికి రూ.10లక్షలు, నాందార్‌పూర్‌కు రూ.15లక్షలు, రేగడిమైలారానికి రూ.20లక్షలు, సాలిండాపూర్‌కు రూ.10లక్షలు, సూర్యానాయక్‌తండాకు రూ.10 లక్షలు, టేకులగడ్డతండాకు రూ.10లక్షలు, తుంకిమెట్లకు రూ.15 లక్షలు, వడిచెర్లకు రూ.15 లక్షలు, ఎనికేపల్లికి రూ.15 లక్షలు, ఎన్నెమీదితండాకు రూ.10లక్షలు, అల్లికాన్‌పల్లికి రూ.25లక్షలు, హంసాన్‌పల్లికి రూ.10లక్షలు, చిల్‌ముల్‌మైలారానికి రూ.20లక్షలు, దుద్యాలకు రూ.80లక్షలు, ఎక్కచెరువుతండాకు రూ.10లక్షలు, ఈర్లపల్లికి రూ. 10లక్షలు, గౌరారానికి రూ.15లక్షలు, లగచెర్లకు రూ.60లక్షలు, నా స్కంపల్లికి రూ.10లక్షలు, రోటిబండతండాకు రూ.10 లక్షలు, సాగారంతండాకు రూ.10లక్షలు, సంట్రకుంటతండాకు రూ.10 లక్షలు, సత్తుర్‌కుటంతండాకు రూ.15 లక్షలు, చెట్టుపల్లితండాకు 15 లక్షలు మంజూరయ్యాయి.



బలపరీక్షకు సిద్ధమైన ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

## హాజరవుతారా..లేదా..?

**నేడు ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ అవిశ్వాసంపై బలపరీక్ష**

- ఇందులో నెగ్గాలంటే 17 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం
- చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గంలో ఉన్నది 15 మంది సభ్యులే

**పోలీసుల బందోబస్తు**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం బలపరీక్ష జరుగనున్నది. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే విశ్వాస పరీక్షకు చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గం కౌన్సిలర్లు హాజరవుతారా..? లేదా అనేది సందిగ్ధంగా మారింది. స్రవంతిపై అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు 17 మంది కౌన్సిలర్లు ఆమెకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. అయితే అందులోని ఇద్దరు సభ్యులు చైర్‌పర్సన్‌వర్గంలో చేరడంతో వ్యతిరేక వర్గంలోని సభ్యుల సంఖ్య ప్రస్తుతం 15కు చేరింది. అవిశ్వాస తీర్మానంలో నెగ్గాలంటే కచ్చితంగా 17 మంది సభ్యుల మద్దతు అవసరం. అవసరమైన సంఖ్యాబలం లేకపోవడంతో నేడు జరుగనున్న బలపరీక్షకు చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గం సభ్యులు హాజరవుతారా..లేదా అనేది తెలియడంలేదు.
కాగా తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి చాకచక్యంగా వ్యవహరించారు. తనకు అనుకూలంగా ఉన్న ఏడుగు రు సభ్యులతోపాటు వ్యతిరేకవర్గం నుంచి వచ్చిన ఇద్దరు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి (ఎక్స్‌అఫీషియో సభ్యుడు)ఓటుతో కలుపుకొని మొత్తం 10 మందిని కూడగట్టుకున్నారు. వారితో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేశారు. బలపరీక్ష గడువు ముగిసేవరకు వారు సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

### 10:30 గంటలకు విశ్వాస పరీక్ష

ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతిపై కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం ఉదయం 10:30 గంటలకు బలపరీక్ష నిర్వహిస్తాం. విశ్వాస పరీక్ష నెగ్గాలంటే కనీసం 17మంది సభ్యుల మద్దతు అవసరం. 17 మంది సభ్యులు హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేస్తే స్రవంతి పదవి నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సభ్యులు తక్కువగా వస్తే తీర్మానం వీగిపోతుంది. బలపరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. **-అనంతరెడ్డి, ఆర్డీవో ఇబ్రహీంపట్నం**

దీంతో ఇబ్రహీంపట్నం చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా..? వీగిపోతుందా అనేది శుక్రవారం తేలనున్నది.

మున్సిపల్ ఎదుట బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న పోలీసు



## వికారాబాద్ జిల్లాలో ఆరుగురు ఎస్ఐల బదిలీ

వికారాబాద్, ఫిబ్రవరి 15 : జిల్లాలో ఆరుగురు ఎస్ఐలు బదిలీ అయినట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న శ్రీశైలం బంట్వారం పీఎస్‌కు.. వికారాబాద్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న అన్వేశ్‌కుమార్ కులకచర్ల ఠాణాకు వెళ్లగా.. బంట్వారం పీఎస్‌లో పనిచేస్తున్న ఆనంద్‌కుమార్ దోమ పీఎస్‌కు బదిలీ అయ్యారు. దోమ ఠాణాలో పనిచేసే రవి వికారాబాద్ జిల్లా కార్యాలయానికి.. వికారాబాద్ జిల్లా కార్యాలయంలో రిజర్వులో ఉన్న కాశీనాథ్ తాండూరు పీఎస్‌కు బదిలీపై వెళ్లగా.. వికారాబాద్ జిల్లా కార్యాలయంలో రిజర్వులో ఉన్న సత్యనారాయణ వికారాబాద్ పీఎస్‌కు బదిలీ అయినట్లు ఎస్పీ తెలిపారు.

## వానకాలం లోపే.. పూడికతీత పూర్తి కావాలి

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్
- జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, చిత్రంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, తదితరులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : వచ్చే వర్షాకాలంలో వరద ముంపు నివారణకు జోన్లవారీగా పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం సీడీఎంఏ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈఎన్‌సీ జియావుద్దీన్‌తో కలిసి మాన్‌సూన్ ప్రిపరేషన్‌పై దానకిశోర్ సమీక్షించారు. జీహెచ్ఎంసీ ఏరియాలో వర్షాకాలంలో ముంపునకు గురయ్యే కాలనీల వివరాలు, ప్రభావిత ప్రజలను సురక్షిత ప్రాం తాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు, అవసరమైన నిధులను జోన్ల వారీగా సిద్ధం చేయాలన్నారు. మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్ ఏరియా ల్లో వరదలతో ప్రమాదాలు జరుగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, వానకాలం రాకముందే నాలాల పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. జీహెచ్ఎంసీకి చుట్టూ పక్కల ఉన్న మున్సిపాలిటీల్లో నూ ఎస్ఎన్‌డీపీ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రెండో దశ ఎస్ఎన్‌డీపీ పనులను చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఈఎన్‌సీని దానకిశోర్ ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్ మేజర్ 101, మీడియం 127, మైనర్ 92 కాగా, ఈ పాయింట్ల రోడ్‌మ్యాప్ గుర్తించే ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పనికిరాని బోర్‌వెల్స్‌ను గుర్తించాలని, ప్రమాదాలు సంభవించకుండా సైన్‌బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ వాటర్ నాలాలో ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులతోపాటు మెష్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఈ దేవానంద్, జోనల్ కమిషనర్లు, ఎస్ఈలు పాల్గొన్నారు.

## ప్రకృతి యాత్రకు చలో.. చలో..

- అటవీ ప్రాంతాలను ఆహ్లాదకర ఉద్యానాలుగా మార్చిన అటవీ శాఖ
- తక్కువ ఖర్చుతో విహార ప్రాంతాలుగా అలరిస్తున్న అర్బన్ పార్కులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్కు
- ట్రెక్కింగ్, ట్రీ క్లైంబింగ్‌తో పాటు నేచర్ క్యాంపుల నిర్వహణ
- ఒత్తిడి నుంచి ఆట విడుపు.. ఇంటిల్లిపాదీ ఆహ్లాదం పొందేలా ఏర్పాట్లు



చిలుకూరు ట్రెక్ పార్కులో.. ఆకట్టుకుంటున్న గ్రీనరీ, కొండలు, వాకింగ్ ట్రాక్....

రంగారెడ్డి, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని రిజర్వ్ ఫారెస్ట్ బ్లాకులను అర్బన్ ఫారెస్ట్ పార్కులుగా అభివృద్ధి చేసింది. హైదరాబాద్ శివారు ప్రాంతాలతోపాటు రంగారెడ్డి జిల్లా పరిధిలో 109 అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించగా.. ఇప్పటివరకు 73 ఫారెస్టులు ప్రజలకు అందుబాటులోకి వచ్చి అలరిస్తున్నాయి. ఈ క్రమంలోనే అద్భుతంగా తీర్చిదిద్దిన చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్కు సహజ సిద్ధమైన ఎన్నో అందాలతో పర్యాటకులను కట్టిపడేస్తున్నది. ట్రెక్కింగ్, ట్రీక్లైంబింగ్, బర్డ్‌వాక్, అడవిలో క్యాంప్ ఫైర్, క్యాంపింగ్ టెంట్.. వసతులతో ప్రకృతి ఒడిలో సేదతీరుతున్న అనుభూతిని కలిగిస్తున్నది.

### ఉల్లాసంగా..ఉత్సాహంగా..

ఉరుకులు పరుగుల జీవితంలో వారాంతంలో ఉల్లాసం కోసం ఎక్కడెక్కడికో వెళ్తుంటాం. ఇంటిల్లిపాదితో కలిసి అలా.. విహారానికి వెళ్తే కలిగే ఆ ఆనందమే వేరు. అయితే..టూర్ ప్లాన్ అనగానే.. ఎక్కడికి !.. ఎలా?..అనే అన్వేషణ మొదలవుతుంది. ఇలా ఆనందంగా వెళ్లి రావడానికి.. ఓ రోజంతా ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు చిలుకూరు ట్రెక్ పార్కు దోహదపడుతున్నది. పెద్ద, పెద్ద నగరాల్లో ఉన్న పార్కులకు ఏ మాత్రం తీసిపోని రీతిలో కొత్త పర్యాటక ఆకర్షణలతో ఈ పార్కును తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ అందుబాటులోకి తెచ్చింది. మనసును ఆహ్లాదపరిచే వాతావరణం.. మండుటెండల్లో సేదతీర్చే పచ్చని చెట్లు..కొండలు..కోనలు.. చెక్‌డ్యాంలలోని జలపాతాలు వాటిపై వంతెనలు..నేలపై పరుచుకున్న గ్రీనరీ.. ప్రకృతి అందాలను ఆస్వాదించేలా ఎత్తైన గుట్టలపై ఏర్పాటు చేసిన గోడలు.. ఇలా ఎన్నెన్నో అందాలు అచ్చంగా అడవుల్లో ఉన్న అనుభూతిని ఈ పార్కు కలిగిస్తున్నది. యోగా.. వాకింగ్ ట్రాక్‌లతో ఆరోగ్యానికి ఉపయోగపడే వసతులతోపాటు.. చిన్నపిల్లలను మంత్రముగ్ధులను చేసే ఎన్నో ఏర్పాట్లు ఇక్కడ ఉన్నాయి. నామమాత్రపు ప్రవేశ రుసుం తప్ప వేరే ఖర్చులు లేకపోవడంతో హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు, సందర్శకులు పెద్ద ఎత్తున ఈ పార్కుకు వచ్చి మంత్రముగ్ధులవుతున్నారు. వేల రూపాయలు వెచ్చించి దూరప్రాంతాలకు వెళ్లకుండానే.. తక్కువ ఖర్చుతో ఇంటిల్లిపాదీ.. ఇక్కడే హాయిగా వినోదాల్లో మునిగి తేలవచ్చు.

### నేచర్ క్యాంపునకు విశేష స్పందన..

ఇటీవల అధికారులు అందుబాటులోకి తెచ్చిన నేచర్ క్యాంపునకు విశేష స్పందన వస్తున్నది. ఎక్కడా పర్యావరణానికి హాని కలుగకుండా.. ట్రెక్కింగ్, రాత్రి గుడారాల్లో బస చేయడం, లాంతర్ల సాయంతో రాత్రి విహారం, వేకువజామున పక్షుల కిలకిలారావాలను ప్రత్యక్షంగా చూడడం, సాహస కార్యక్రమాల్లో భాగంగా రివర్ క్రాసింగ్, చెట్లు ఎక్కడం వంటి కార్యక్రమాలను నిర్వహించి జీవితానికి సరిపడా అనుభూతిని ఈ క్యాంపు ద్వారా కల్పిస్తున్నారు. ఇక్కడి నేచర్ క్యాంపునకు వస్తున్న ఆదరణను చూసి పలు అడవుల్లోనూ ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.





